కె. బి. కృష్ణ

# తె. మ. బ. ప్ర

అది ఒక టూరిస్ట్ సెంటర్. ఆ యాత్రాస్థలం తెలుగు దేశంలో వుంది. తెలుగు ప్రాంతీయుల పుణ్యక్షేత్రం అది.

నేను ఆ క్షేత్రం దర్శించడానికి వెళ్ళాను. బస్‌కోసం ఎదురు చూస్తున్నాను. ఒక ప్రక్కన ప్రైవేటు బస్సులు ఆగడానికి పెద్ద స్థలం వుంది. మరో ప్రక్కన ప్రభుత్వ బస్సులు ఆగే బస్‌స్టేషన్.

ఈలోగా....

తమిళనాడు నుంచి ఒక బస్ కర్నాటకనుంచి ఒక బస్, వచ్చేయి.

అందులో నుండి గడబిడలాడుతూ జనం దిగేరు.

తమిళులు వాళ్ళను తెలుగువాళ్ళనుకోవాలనే ఆరాటంతో మాయదారి తెలుగు మాట్లాడుతున్నారు. తెలుగుతల్లి వాళ్ళ భాషవింటే ఆమెకు ఆత్మహత్య వినా, మరోమార్గం లేదు.

ఒక భార్యతో భర్త అంటున్నాడు, "సూస్తివా మనం దా రాత్రిల ఏరినామా. ఇప్పొదా ఇంగె పుడిస్తిమి" అలా అంటూ అంత విశాలమైన స్థలంలో అందరి ఎదురుగా లుంగీ పూర్తిగా విప్పేసి దులిపి మళ్ళీ కట్టుకున్నాడు.

"ఏమీ మనవాండ్లు రెండు పూడుస్తామని కత్తరాంగే చూడు మీ" అంటుందా మహిళ.

ఆ లుంగీ వ్యక్తి "తె.మ.బ.ప్ర" అనే తాటికాయలంత అక్షరాలున్న చోటుకి వెళ్ళేడు.

అక్కడ ప్రవేశ ద్వారంలో బల్లమీద కూర్చున్న వ్యక్తి టోకెన్ "టోకెన్ తీసుకోండి" అని దబాయించేడు అరవాయన్ని చూసి.

"ఎన్నప్పా?" అన్నాడాయన.

"పోయ్యా-వెళ్ళావులే. ఆ ప్రక్కన పౌలాల్లోకి వెళ్ళు"

అరవాయనకు అర్థంకాలేదు.

అక్కడే నిలబడి ఈ తతంగం చూస్తున్న నన్ను 'అదేమిటని' అడిగాడు.

"సామీ. అది తెలుగుఆడవాళ్ళు బ హి ర్ భూమికి వెళ్ళే ప్రదేశం" అని చెప్పాను.

అతను తల కొట్టుకుని వెళ్ళిపోయాడు.

ఆడాళ్ళ దగ్గరకు వెళ్ళాడు అతను. ఆడవాళ్ళందరూ దిక్కు తోచక అటూఇటూ, తిరుగుతున్నారు పాపం.

ఇవన్నీ చూసి "అంగె రెండు పుడుస్తు మా" అన్నారు.

"సుమ్మా ఇరి. అంగె తెలుంగు పొంబ్లె పోనం, నంబ పోకూడదు" అన్నాడు.

"ఎన్నా ఇదప్పా" అంటూ అందరూ బస్ ఎక్కారు. బస్ వెళ్ళి పోయింది.

అక్కడ నిలబడి వున్న పోర్టర్ నవ్వుకుంటున్నాడు.

"ఏమిటి సంగతీ" అన్నాను.

ఆ తెలుగు మహిళా బహిర్ ప్రదేశంలో తెలుగు ఆడవాళ్ళు తప్ప వెళ్ళకూడదని ఆ అరవాయన చెప్తున్నాడండి. అందుకని బస్ ఊరి చివరకు వెళ్ళింది అన్నాడతను.

భలే బాగుంది మనది తెలుగు సంస్కృతి కదా—

—o—